క్లుప్తంగా

అసాంఘిక కార్యక్రమాలను అడ్డుకోవాలి

తాలూకా పోలీసులకు వినతి

గుడివాడరూరల్: నాగవరప్పాడు– లింగవరం రోడ్డు సచివాలయానికి వెళ్లే దారి రాత్రి సమయాల్లో మద్యం సేవించేందుకు, అసాంఘిక కార్యక్రమాలు జరిగేందుకు అడ్డాగా మారిందని, వీటికి అడ్డుకట్ట వేయాలని లింగవరం గ్రామస్తుడు, సామాజిక కార్యకర్త ఎ.రవికిరణ్ పేర్కొన్నారు. బుధవారం పరిసర ప్రాంతాల ప్రజల నుంచి సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టారు. గుడివాడ తాలూకా పోలీస్ స్టేషన్‌లో వినతిపత్రం అందజేశారు. ఆయన మాట్లాడుతూ రాత్రి సమయాల్లో మహిళలు, చిన్నారులు ఈ రహదారిలో వెళ్లాలంటే మందుబాబులకు అడ్డాగా మారిందని పోలీసులు స్పందించి చర్యలు తీసుకోవాలని కోరారు.

పైపు వాల్స్ ప్రారంభం

మండవల్లి: మండవల్లి మెయిన్ సెంటర్‌లో నూతనంగా నిర్మించిన మొగలి మంచినీటి చెరువు మూడు పైపువాల్స్‌ను బుధవారం సర్పంచ్ మెండా ఝాన్సీ ప్రారంభించారు. సర్పంచ్ మాట్లాడుతూ ప్రజలకు రక్షిత తాగునీటి పథకం ద్వారా తాగునీటికి ఎలాంటి సమస్యలు లేకుండా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు.

ముగిసిన అమ్మవారి జాతర

గుడివాడ టౌన్: నందివాడ మండలం జనార్దనపురంలో వేంచేసియున్న శ్రీ రేణుకా పుట్టలాంబ అమ్మవారి పంచవింశత 25వ వార్షిక బ్రహ్మోత్సవాలు బుధవారం ఘనంగా ముగిశాయి. ఈ నెల 9న ప్రారంభమైన ఈ బ్రహ్మోత్సవాలు అమ్మవారి సన్నిధిలో మూలమంత్ర హోమాలు, కళాహోమాలు, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించడంతో ఈ ఉత్సవాలు ముగిశాయని నిర్వాహకులు తెలిపారు. అనంతరం భారీ అన్నసమారాధన చేశారు.

ఫెన్సింగ్ పనులు ప్రారంభం

తోట్లవల్లూరు: గ్రామాల పరిశుభ్రతలో ప్రజలు భాగస్వాములు కావాలని బొడ్డపాడు సర్పంచ్ మూడే శివశంకర్ సూచించారు. మండలంలోని బొడ్డపాడు సంపద కేంద్రం వద్ద రూ.2.25 లక్షల వ్యయంతో ఫెన్సింగ్ ఏర్పాటు పనులను బుధవారం ఆయన ప్రారంభించారు. చెత్త రహిత గ్రామంగా బొడ్డపాడును తీర్చిదిద్దటానికి తన వంతు కృషి చేస్తున్నట్లు శివశంకర్ చెప్పారు. ఉప సర్పంచ్ కే శివశంకర్, పంచాయతీ కార్యదర్శి రమాదేవి, వార్డు సభ్యుడు శ్రీనివాసరావు, పాలకేంద్రం అధ్యక్షుడు వసంత్‌కుమార్, మధుబాబు, చినబాబు, రామకృష్ణ, శ్రీనివాసరావు పాల్గొన్నారు.

కొలతల మేరకు పనులు చేయాలి

పామర్రు: ఉపాధి హామీ పథకం ద్వారా గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎంతో లబ్ధి చేకూరుతుందని ఎన్ఆర్ఈజీఎస్ ఏపీవో సురేష్ తెలిపారు. గ్రామంలో నిర్వహిస్తున్న ఉపాధి పనులను పరిశీలించి కూలీల మస్టర్‌లను బుధవారం తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల పరిధిలోని 25 గ్రామ పంచాయతీలలో 1,520 మంది కూలీలు ఉపాధి పనులు చేశారని అన్నారు. పంట కాలువలలో పూడిక తీత పనులు, పంట బోదెలలో మట్టి తవ్వకం పనులను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. నాణ్యతా ప్రమాణాలతో, కచ్చితమైన కొలతతో పనులు చేయాలన్నారు. ఫీల్డు అసిస్టెంట్లు, మేట్లు, కూలీలు పాల్గొన్నారు.

శిథిల భవనాలను తొలగించండి

గుడివాడ టౌన్: పట్టణంలో నూరేళ్ల పైబడి భవనాలను తక్షణమే గుర్తించి తొలగించాలని సీఐటీయూ పట్టణ కార్యదర్శి ఆధ్వర్యంలో వినతిపత్రాలు సమర్పించారు. స్థానిక ఎన్టీఆర్ కాలనీలోని సచివాలయంలో బుధవారం సచివాలయ అడ్మిన్‌కు వినతి పత్రం సమర్పించారు. ఎన్టీఆర్ కాలనీలో ప్రభుత్వానికి చెందిన బీసీ సంక్షేమ బాలికల హాస్టల్ 10 ఏళ్ల క్రితం శిథిలావస్థకు చేరి మూసివేసినా ఇప్పటి వరకు దానిని తొలగించకపోవడంతో పరిసర ప్రజలు ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. ఆ ప్రాంగణంలో మొక్కలు, దుబ్బుల కారణంగా పాములు చేరి ప్రజలకు హాని కలిగిస్తున్నా యన్నారు. పరిసర ప్రాంత ప్రజల ఇబ్బందుల దృష్ట్యా భవనాన్ని తక్షణమే తొలగించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు లంకా సురేంద్ర, పి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. దీనిపై స్పందించిన అడ్మిన్ జె.అనిల్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళతామని హామీ ఇచ్చారు.

పేదలకు అన్నదానం

గుడివాడ టౌన్: ఆకలితో ఉన్న అనాథలను ఆదుకోవాలనేదే ఆర్కే వారియర్స్ ఉద్దేశమని కన్వీనర్ మాచర్ల రామకృష్ణ (ఆర్కే) అన్నారు. బుధవారం స్థానిక రైల్వేస్టేషన్ రోడ్‌లో వారియర్స్ సభ్యులు కుంభం అయ్యప్ప వితరణతో భోజన పంపిణీ ఏర్పాట్లు చేసినట్లు ఆర్కే తెలిపారు. సమాజం ఒక దేవాలయం, ప్రజలే దేవుళ్లుగా భావిస్తూ సేవా కార్యక్రమాలను నిర్వహించేందుకు మిత్రులు అయ్యప్ప స్పందించారన్నారు. వారియర్స్ సభ్యులు గంటా రాంబాబు, గాదె చరణ్ పాల్గొన్నారు.

ఫిర్యాదుల బాక్స్ ఏర్పాటు

గుడ్లవల్లేరు: స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఫిర్యాదుల బాక్స్‌ను బుధవారం గ్రామ కార్యదర్శి జె.నరసింహారావు ఏర్పాటు చేశారు. ఇటీవల పంచాయతీలో ఒక ఉద్యోగిని కాసులు ఇస్తేనే పనులు చేస్తున్నారని, లేకపోతే మొండిచెయ్యి చూపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తాయి. దీంతో ఈ ఫిర్యాదుల బాక్స్‌ను ఏర్పాటు చేశారు.

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- అనుమతి లేకుండా మట్టి తవ్వేస్తున్న మాఫియా
- పట్టించుకోని అధికారులు
- ఫిర్యాదు చేసినా స్పందన కరువు



పెదగొన్నూరు జెడ్పీ హైస్కూల్ సమీపంలో చెరువు తవ్వకం



బొమ్మినంపాడులో అనుమతులు లేకుండా చెరువులో మట్టి తవ్వుతున్న పొక్లెయిన్

ముదినేపల్లి రూరల్: మండలంలోని పలు గ్రామాల్లో అడ్డగోలుగా చేపల చెరువుల తవ్వకాలు నిర్వహిస్తున్నారు. అనుమతులు లేకుండా అధికార పార్టీ అండదండలతో గ్రామ స్థాయి నాయకులు చెలరేగిపోతూ చెరువులు తవ్వేస్తున్నారు. దీనిని అరికట్టాల్సిన అధికారులు చోద్యం చూస్తున్నారు మినహా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెరువుల తవ్వకాల్లో వచ్చిన మట్టిని అక్రమంగా రవాణా చేస్తూ రూ.లక్షల్లో సొమ్ములు దండుకుంటున్నారు. రెవెన్యూ అధికారుల అవినీతి కారణంగా అక్రమార్కులు మరింత రెచ్చిపోతున్నట్లు ఆయా గ్రామాల్లోని ప్రజలు ఆరోపిస్తున్నారు.

ఈ గ్రామాల్లోనే..

మండలంలోని పెదగొన్నూరు, బొమ్మినంపాడు, వైవాక గ్రామాల్లో చెరువుల తవ్వకాలు భారీ ఎత్తున సాగుతున్నాయి. పెదగొన్నూరు హైస్కూల్ సమీపంలోనే ప్రజల కళ్లెదుట చెరువు తవ్వుతున్నా అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. చెరువు తవ్వకాలు చేపట్టాలంటే మండల స్థాయి కమిటీ నుంచి జిల్లా స్థాయి కమిటీ వరకు పరిశీలించి అనుమతులు ఇవ్వాల్సి ఉంది. ప్రస్తుతం ఇందుకు విరుద్ధంగా ఎలాంటి అనుమతులు లేకుండా చెరువులు తవ్వేస్తున్నారు.

స్థానికుల అడ్డగింత..

పెదగొన్నూరు హైస్కూల్ పక్కన గతంలో చెరువు తవ్వకానికి ప్రయత్నాలు చేయగా విద్యార్థులకు ప్రమాదం వాటిల్లుతుందనే భయంతో స్థానికులు అడ్డుకున్నారు. అయినప్పటికీ అక్రమార్కులు తెగబడి తిరిగి మళ్లీ చెరువు తవ్వకాలు చేస్తున్నారంటే అధికారుల నిర్లక్ష్య వైఖరి తేటతెల్లమవుతోంది.

ఆపే చర్యలేవీ..

దీనిపై స్థానిక వీఆర్వో వెంకట్రావు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేశానని చెబుతున్నారే తప్ప తవ్వకాలు ఆపేందుకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. చెరువులోని మట్టిని సైతం అడ్డదారుల్లో బయటకు తరలించేస్తున్నారు. బొమ్మినంపాడులో ఇదేవిధంగా అనుమతులు లేకుండా చెరువు తవ్వకం చేస్తుంటే స్థానిక వీఆర్వో వెంకటేశ్వరరావు అడ్డుకున్నారు. అయినప్పటికీ తవ్వకందారులు ఏ విధంగానైనా పనులు చేపట్టాలనే పట్టుదలతో అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. వైవాకలో పంట కాలువ సమీపంలో అనుమతులు లేకుండా చెరువు తవ్వకం చేపట్టారు.

ఫిర్యాదు చేసినా..

దీనిపై స్థానికులు మండల స్థాయి అధికారికి ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని చెబుతున్నారు. ఈ విధంగా కూటమి పార్టీలకు చెందిన ద్వితీయ శ్రేణి నాయకులు అధికారులను నయానా, భయానా లోబరుచుకుని తమ పనులు కానిచ్చేస్తున్నారు.

చెప్పేదొకటి..చేసేదొకటి..

స్థానిక ఎమ్మెల్యే కామినేని ఇలాంటి చర్యలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించనని పదేపదే చెబుతున్నప్పటికీ ఆచరణలో మాత్రం ఇందుకు విరుద్ధంగా జరుగుతోంది. ఇప్పటికైనా చెరువుల అక్రమ తవ్వకాలను నిలిపివేసేలా అధికారులను ఆదేశించాలని ప్రజలు కోరుతున్నారు. బాధ్యులైన వారిపై చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

చర్యలు తీసుకుంటాం..

మండలంలో బొమ్మినంపాడు, పెదగొన్నూరు గ్రామాల్లో చెరువుల తవ్వకాలపై ఫిర్యాదులు రాగా వెంటనే నిలిపివేయించాలని వీఆర్వోలను ఆదేశించాం. వైవాక గ్రామంలో జరుగుతున్న చెరువు తవ్వకాల గురించి తమకు తెలియదు. క్షేత్రస్థాయిలో పరిశీలన చేసి తగిన చర్యలు తీసుకుంటాం.

– రాజశేఖర్, ఎంఆర్ఐ, ముదినేపల్లి

మహిళల రాస్తారోకో



పెదపారుపూడి: స్థానిక ప్రధాన సెంటర్‌లో రెండవ వైన్స్ షాపు ఏర్పాటు చేయొద్దని గ్రామస్తులు బుధవారం గుడివాడ– కంకిపాడు రోడ్డుపై రాస్తారాకో నిర్వహించారు. గ్రామ సర్పంచ్ చప్పిడి సమీరా మాట్లాడుతూ గ్రామంలో ఒక వైన్ షాపు ఉందని, మరలా రెండవ వైన్స్ షాపు కూడా ఏర్పాటు చేయటం వలన చాలా ఇబ్బందులు వస్తాయన్నారు. నిత్యం బస్‌ల కోసం మహిళలు బస్ సాప్ట్ వద్ద బస్‌లకోసం వేచి ఉంటారని, అదే సమయంలో మందుబాబులు ఇబ్బందులు గురి చేస్తారన్నారు. అధికారులు స్పందించి వైన్ షాపు ఏర్పాటు చేయటం నిలుపుదల చేయాలని కోరారు. ఎస్ఐ ప్రవీణ్ కుమార్‌రెడ్డి ఆందోళనకారులతో మాట్లాడారు.

అంగన్‌వాడీ కేంద్రం తనిఖీ

కారకంపాడు(మొవ్వ): మండలంలోని అయ్యంకి శివారు కారకంపాడు (అయ్యంకి– 3) అంగన్‌వాడీ కేంద్రాన్ని మహిళా శిశు సంక్షేమ శాఖ జిల్లా ప్రాజెక్టు డైరెక్టర్ ఎంఎన్.రాణి బుధవారం తనిఖీ చేశారు. ఆమె అవనిగడ్డ పర్యటనకు వెళుతూ మార్గ మధ్యలో ఈ కేంద్రాన్ని పరిశీలించారు. ప్రీ స్కూల్ పిల్లల సంఖ్య, హాజరు, అంగన్‌వాడీ కేంద్రానికి సంబంధించిన యాప్ నిర్వహించే విధానంపై అంగన్‌వాడీ కార్యకర్త బి.విశాలాక్షిని ప్రశ్నించారు. పిల్లల ఆటపాటలను పరిశీలించి పలు విషయాలను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీ కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు. వేసవి ఎండల నేపథ్యంలో పిల్లలను జాగ్రత్తగా తీసుకుని వచ్చి తిరిగి ఇంటి వద్ద దింపాల్సిందిగా హెల్పర్ సీహెచ్ సుజాతను ఆదేశించారు.

మాజీ మంత్రి, మాజీ ఎంపీలను కలిసిన వైఎస్సార్ సీపీ నేతలు



మాజీమంత్రి పేర్ని నానిని కలిసిన నియోజకవర్గ నేతలు



మాజీ ఎంపీ నందిగం సురేష్‌ను కలిసిన నాయకులు

గుడివాడరూరల్: వైఎస్సార్ సీపీలో ఇటీవల నూతనంగా పదవులు పొందిన నియోజకవర్గంలోని నాయకులు మాజీమంత్రి పేర్ని వెంకట్రామయ్యను(నాని), మాజీ ఎంపీ నందిగం సురేష్‌లను బుధవారం మర్యాదపూర్వకంగా తాడేపల్లిలో కలిశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గుడివాడ నియోజకవర్గంలో పార్టీ బలోపేతానికి నూతనంగా పదవులు పొందిన వారు కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకుడు దుక్కిపాటి శశిభూషణ్, జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టా జాన్‌విక్టర్, నూతనంగా పదవులు పొందిన నియోజకవర్గంలో నాయకులు పెయ్యల ఆదాం, కారే జోసఫ్, కందుల నాగరాజు, కోట ప్రోలు నాగు, వెంపటి సైమన్, కొర్నిపాటి గణపతి ఉన్నారు.

వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌ను కలిసిన విక్టర్..

వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు టీజేఆర్ సుధాకర్‌ను జిల్లా ఎస్సీ సెల్ అధ్యక్షుడు మట్టా జాన్ విక్టర్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సుధాకర్ జిల్లాలో పార్టీ బలోపేతానికి కృషి చేయాలని విక్టర్‌కు సూచించారు.

సూర్యం మరణం వైఎస్సార్ సీపీకి తీరని నష్టం

వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు డీఎన్నార్

కైకలూరు: వైఎస్సార్ సీపీ అభివృద్ధికి అహర్నిశలు కృషి చేసిన కలిదిండి మండలం చిన తాడినాడకు చెందిన అల్లూరి సూర్యనారాయణరాజు (సూర్యం) మరణం పార్టీకి తీరని లోటని పార్టీ జిల్లా అధ్యక్షుడు దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) అన్నారు. చిన తాడినాడలో సూర్యం నివాస గృహానికి కుటుంబ సమేతంగా వెళ్లి ఆయన కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు. సూర్యం మరణంపై విచారం వ్యక్తం చేశారు. పరామర్శించిన వారిలో వైఎస్సార్ సీపీ ముదిరాజుల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కోమిటి విష్ణువర్ధనరావు, కలిదిండి ఎంపీపీ చందన ఉమామహేశ్వరరావు, పార్టీ మహిళా విభాగం రాష్ట్ర సెక్రటరీ కూసనపూడి కనకదుర్గారాణి, మండల పార్టీ అధ్యక్షుడు తిరుమాని రమేష్, నియోజకవర్గ రైతు విభాగ అధ్యక్షుడు కొల్లాటి సత్యనారాయణ, పబ్లిషింగ్ వింగ్ అధ్యక్షుడు పాము రవికుమార్, సర్పంచ్ గండికోట ఏసుబాబు, మాజీ ఎమ్మెల్యే కనుమూరి బాపిరాజు, నాయకులు సాగి వెంకటరాజు, పెన్మెత్స నాగరాజు, బొర్రా శ్రీను, పెన్మెత్స ఏడుకొండలు, బొర్రా నాగరాజు, హరికృష్ణ, ఏడుకొండలు ఉన్నారు.

పదో తరగతి పరీక్షల తనిఖీ

మొవ్వ: మండలంలో పదో తరగతి పరీక్షలు నిర్వహిస్తున్న ఆరు కేంద్రాలలో కొన్ని కేంద్రాలను మచిలీపట్నం డివిజన్ విద్యాశాఖ అధికారి బీఎస్‌పీ శేఖర్ సింగ్, మండల విద్యాశాఖ అధికారి– 2 కే శ్రీలక్ష్మి, పోలీసు అధికారి కలిసి బుధవారం ఫ్లయింగ్ స్క్వాడ్‌గా పరిశీలించారు. మండలంలోని కూచిపూడి, పెడసనగల్లు, మొవ్వ కేంద్రాలలో అధిక సమయం గడిపి నిర్వాహకులకు పలు సూచనలు ఇచ్చారు. మండల పరిధిలో పరీక్షకు 533 మంది హాజరవ్వాల్సి ఉండగా ఇద్దరు గైర్హాజరయ్యారని, 531 మంది హాజరైనట్లు కే లక్ష్మి తెలిపారు.

22 లోగా దరఖాస్తు చేసుకోవాలి

మండవల్లి: మండలంలో వెనుకబడిన తరగతుల వారు రుణాల కోసం ఈ నెల 22వ తేదీ లోగా మీసేవా కేంద్రాల్లో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీఓ బుధవాం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కుట్టు మిషన్లకై సచివాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవాల్సినదిగా కోరారు.

కూచిపూడి ఎస్సైగా నాగవిశ్వనాథ్

కూచిపూడి(మొవ్వ): కూచిపూడి పోలీస్ స్టేషన్ ఎస్ఐగా కే నాగవిశ్వనాథ్ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇప్పటి వరకు కూచిపూడి ఎస్సైగా విధులు నిర్వహించిన ఎం.సుబ్రహ్మణ్యం భీమవరం రైల్వే ఎస్సైగా బదిలీ అయ్యారు. 2020 సంవత్సర బ్యాచ్‌కు చెందిన కే నాగవిశ్వనాథ్ విజయవాడలోని భవానీపురం, సత్యనారాయణపురం, సైబర్ క్రైమ్‌లో పనిచేసి బదిలీపై కూచిపూడి వచ్చారు.

మినుముల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలి

- రైతు సంఘం నేత నీలం మురళీకృష్ణారెడ్డి
- గతంలో మార్కెట్‌యార్డ్‌లో కొనుగోలు కేంద్రం ఉండేది



గుడివాడరూరల్: రాష్ట్ర ప్రభుత్వం, జిల్లా అధికారులు గుడివాడ నియోజకవర్గంలో మినుముల కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం దారుణమని రైతు సంఘం నాయకుడు నీలం మురళీకృష్ణారెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గత ప్రభుత్వ హయంలో గుడివాడ మార్కెట్ యార్డ్‌లో మినుము కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేశారని ఆయన గుర్తు చేశారు. జిల్లాలో 12 కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి గుడివాడలో కేంద్రం ఏర్పాటు చేయకపోవడం సరికాదన్నారు. వేలాది రూపాయలు ఖర్చు చేసి రైతులు మినుము సాగు చేస్తే సరైన మద్దతు ధర కల్పించలేదంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. మూడు మండలాల పరిధి అయిన గుడివాడలో కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయకపోవడం విచారకరమన్నారు. దీనిపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము స్పందించి కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలని ఆయన కోరారు. రైతు ప్రభుత్వంగా చెప్పుకునే కూటమి ప్రభుత్వం రైతుల పట్ల చిన్న చూపు మానుకోవాలని సూచించారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు కొనుగోలు కేంద్రం ఏర్పాటుపై పునరాలోచన చేయాలని, లేనిపక్షంలో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవలసి వస్తుందని ఆయన హెచ్చరించారు.

క్రీస్తు బోధనలు అనుసరించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఆనంద్ ఇమ్మానుయేలు

పామర్రు: ప్రభువైన ఏసు క్రీస్తు బోధనలను ప్రతి ఒక్కరూ అనుసరించాలని మచిలీపట్నంకు చెందిన ప్రముఖ పాస్టర్ రెవరెండ్ డాక్టర్ కేపీ ఆనంద్ ఇమ్మానుయేల్ పేర్కొన్నారు. స్థానిక పామర్రు మండల పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పామర్రు ఫుల్ గాస్పెల్ చర్చిలో బుధవారం సంఘ సభ్యుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరూ ప్రభువు చూపిన మార్గంలో పయనిస్తూ క్షమ, దయ, శాంతి గుణాలను కలిగి ఉండాలన్నారు. తన వలే తన పొరుగు వారిని ప్రేమించాలని, అప్పుడు సమాజం శాంతి మయంగా మారుతుందని తెలిపారు. అనంతరం 130 మంది సేవకులకు ప్రోత్సాహకాలను అందజేశారు. అధ్యక్షుడు రెవరెండ్ డాక్టర్ కె.యేసుదాసు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ ఎస్‌పురుషోత్తం, సెక్రటరీ ఎస్.శ్యామ్యూల్, జాయింట్ సెక్రటరీ కె.రవికుమార్, ట్రెజరర్ బి.ఇస్రాయేలు, వర్కింగ్ ప్రెసిడెంట్‌ఎస్ జైపాల్, రికార్డింగ్ సెక్రటరీ బీవీ సాగర్, రాజు, ఆర్.సల్మాన్, ప్రకాశరావు, కరుణాకరరావు, సేవకులు పాల్గొన్నారు.

మాజీ ఐఏఎస్ ఆగడాలకు ఉప సభాపతి ఊతం

టీడీపీ నాయకుడు, సామాజిక వేత్త నాగేంద్రరావు ఆరోపణ

గుడ్లవల్లేరు: విన్నకోటకు చెందిన మాజీ ఐఏఎస్ పీవీ రమేష్ ఆగడాలకు అసెంబ్లీ ఉప సభాపతి రఘురామ కృష్ణంరాజు ఊతం ఇస్తున్నారని విన్నకోట టీడీపీ నాయకుడు, సామాజిక వేత్త గాలంకి నాగేంద్రరావు ఆరోపించారు. విన్నకోటలో 127 ఎకరాల చేపల చెరువుల సర్వేను వెంటనే నిలిపి వేయాలని ఆయన బుధవారం తహసీల్దార్ బి.లోకరాజును కోరారు. కేవలం తన పొలం 50 సెంట్లను ఆక్రమించుకునేందుకే మాజీ ఐఏఎస్ రమేష్ ఈ సర్వేను చేయిస్తున్నారన్నారు. ఉప సభాపతి రఘురామకృష్ణరాజు ద్వారా జిల్లా కలెక్టర్, ఇతర అధికారులను ఆదేశించి, అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారని నాగేంద్రరావు ఆరోపించారు. తన పొలం 50 సెంట్లను వెబ్ ల్యాండ్‌లో అప్పట్లో పీవీ రమేష్ చెబితే.. అధికారులు తొలగించటం అన్యాయమని వాపోయారు. తన పొలం డాక్యుమెంట్స్‌ను అధికారులకు సమర్పించానని తెలిపారు. కానీ వెబ్ ల్యాండ్‌లో తన పొలాన్ని చేరనివ్వకుండా పీవీ రమేష్ అధికార బలంతో అడ్డుకుంటున్నారని ఆరోపించారు. తన పొలాన్ని చెరువులో కలిపేసుకునేందుకే పీవీ రమేష్ వెబ్‌ల్యాండ్‌లో మాయం చేయించారన్నారు. ఇపుడు ఆ పొలాన్ని తన చేపల చెరువులో కలుపుకునేందుకు ప్రయత్నిస్తున్నారని చెప్పారు. దీంతో అధికారులు తన వినతిని పక్కన పెట్టేసి.. సర్వే చేస్తున్నారని ఆరోపించారు. తన పొలాన్ని వెబ్‌ల్యాండ్‌లో చేర్చాకే సర్వేను నిర్వహించాలన్నారు. దీనిపై తహసీల్దార్ బి.లోకరాజును వివరణ కోరగా పెండింగ్‌లో ఉన్న రైతుల అర్జీలను పరిష్కరించడంలో భాగంగానే ఈ సర్వే చేయిస్తున్నామన్నారు. గాలంకి నాగేంద్రరావుకు ఉన్న 50 సెంట్ల పొలానికి సంబంధించిన ఫైల్‌ను కూడా బుధవారమే జిల్లా కలెక్టర్‌కు పంపించామన్నారు. ఆయన ఆస్తికి కూడా ఆధారం కల్పిస్తామని చెప్పారు. ఆయనకు హక్కు వచ్చేంత వరకు మిగిలిన రైతులకు సంబంధించిన సర్వే ఆపాలంటే..అది నిబంధనలకు విరుద్ధమేనని చెప్పారు.

శతాధిక వృద్ధురాలి మృతి



తోట్లవల్లూరు: శతాధిక వృద్ధురాలు మృతి చెందిన ఘటన మండలంలోని బొడ్డపాడులో జరిగింది. గ్రామానికి చెందిన నిమ్మగడ్డ వెంకటరావమ్మ (102) బుధవారం ఉదయం అనారోగ్యంతో మృతి చెందారు. ఆమె భర్త ప్రసాదరావు గత నలభై ఏళ్ల క్రితమే మృతి చెందారు. ముగ్గురు కుమారులు ఉన్నారు.

విద్యుత్ మోటార్‌లో తీగల చోరీ

- ఒక్క రోజులో 50 మోటార్ల వైర్లు కత్తిరించి అపహరణ
- చాగంటిపాడు మాగాణి పొలాల్లో ఘటన
- వల్లూరుపాలెంలో ఇటీవల 200 మోటార్ల వైర్లు చోరీ



చాగంటిపాడులో దొంగలు కత్తిరించిన సబ్ మెర్సిబుల్ మోటారు కేబుల్

తోట్లవల్లూరు: విద్యుత్ తీగల దొంగలు మండలంలోని చాగంటిపాడులో మంగళవారం రాత్రి హల్‌చల్ చేశారు. స్థానిక మాగాణి పొలాల్లో వ్యవసాయ మోటార్లకు సంబంధించిన కేబుల్ వైర్లను ఇష్టానుసారం కత్తిరించి అపహరించారు. సుమారు 50 మంది రైతులకు చెందిన సబ్ మెర్సిబుల్ మోటార్ల నుంచి మీటరు బోర్డు వరకు ఉండే విద్యుత్ కేబుల్ వైరును కట్ చేసి తస్కరించారు. విద్యుత్ కేబుల్ వైర్లలో ఉండే రాగితీగల కోసమే వైర్ల చోరీకి పాల్పడుతున్నట్లు రైతులు అభిప్రాయపడుతున్నారు. మండలంలోని వల్లూరుపాలెంలో ఇటీవల దాదాపు 200 మోటార్లకు సంబంధించిన విద్యుత్ కేబుళ్లను దొంగలు అపహరించారు. ఈ సంఘటనకంటే ముందు ఒక పర్యాయం ఇలాగే చోరీ జరిగినప్పుడు పోలీసులకు ఫిర్యాదు చేసినా స్పందన లేదని రైతులు తెలిపారు. ఈ ఘటన మరువక ముందే మళ్లీ చాగంటిపాడులో యథేచ్ఛగా విద్యుత్ తీగల చోరీకి పాల్పడటం పట్ల రైతులు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. ఒక్కో రైతుకు రూ.2 నుంచి 3 వేల వరకు నష్టం వాటిల్లిందని, మొత్తం నష్టం విలువ రూ.1.50 లక్షల వరకు ఉండొచ్చని రైతులు అంటున్నారు. ఓ వైపు ఎండల తీవ్రతతో పొలాలకు నీటి తడులు అందించటమే కష్టతరమైతే, వైర్ల అపహరణతో మరిన్ని ఇబ్బందులు పడే పరిస్థితి తలెత్తిందని రైతు కళ్లం వెంకటేశ్వరరెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు. పోలీసులకు సమాచారం ఇచ్చామన్నారు. పోలీసులు స్పందించి విద్యుత్ కేబుల్ వైర్ల అపహరణకు పాల్పడుతున్న వారిని గుర్తించి, తగిన చర్యలు తీసుకోవాలని, రైతులను కాపాడాలని విజ్ఞప్తి చేశారు.

కరాటేలో విద్యార్థుల ప్రతిభ



విజేతలైన విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ సిస్టర్ వలసా సెబాస్టియన్

పామర్రు: కరాటే ఓవరాల్ చాంపియన్ పోటీలలో తమ హైస్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబర్చి విజేతలుగా నిలిచారని అసీస్సీ హైస్కూల్ ప్రిన్సిపాల్ వలసా సెబాస్టియన్ పేర్కొన్నారు. స్థానిక అసీస్సీ హైస్కూల్‌లో విజేతలైన విద్యార్థులను బుధవారం అభినందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈనెల 16వ తేదీన విజయవాడ సింగ్‌నగర్‌లోని ఉజల కల్యాణ మండపంలో ఓవరాల్ చాంపియన్ కరాటే పోటీలను నిర్వహించారన్నారు. ఈ పోటీలలో 6– 7 సంవత్సరాలలో స్నేక్ పామ్ కటా విభాగంలో రేష్మ, షేయన్సీలు ప్రథమ స్థానం సాధించారని అన్నారు. 8– 9 సంవత్సరాల క్రేన్ కటా విభాగంలో సాత్విక్, శ్రీ చందనలు ప్రథమ స్థానం సాధించారని అన్నారు. 11– 13 సంవత్సరాల క్రేన్ కటా విభాగంలో భవ్య, తేజ విజయం సాధించారన్నారు. 11– 13 సంవత్సరాలు పోర్ షోలయ్ కటా విభాగంలో దిల్సి ప్రథమ స్థానం సాధించారని తెలిపారు. 12– 13 సంవత్సరాల మంకీ ఫామ్ బాలుర విభాగంలో అవిష్, బాలికలలో కావ్యలు ప్రథమ స్థానం సాధించారు. 9– 10 సంవత్సరాలు మంకీఫామ్ విహాస్ ప్రథమ స్థానం సాధించారు. విద్యార్థులను, శిక్షణ ఇచ్చిన కరాటే మాస్టర్ జీ శంకర్‌బాబులను ప్రిన్సి పాల్, పీఈటీ ఎం.గ్లాడిసన్, ఉపాధ్యాయులు అభినందించారు.

శక్తి యాప్‌పై అవగాహన



సెల్‌ఫోన్‌లో యాప్‌ను డౌన్ చేసుకున్న విద్యార్థులతో సీఐ

కైకలూరు: ప్రభుత్వం ప్రత్యేకంగా ప్రవేశపెట్టిన 'శక్తి యాప్' మహిళలకు వరం లాంటిదని కైకలూరు పట్టణ సీఐ పి.కృష్ణ చెప్పారు. ఆటపాక వైవీఎన్నార్ ప్రభుత్వ డిగ్రీ కాలేజీలో ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో మహిళలకు శక్తి యాప్‌పై బుధవారం అవగాహన కల్పించారు. సెల్ ఫోన్లలో యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ వై.శ్రీలత అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో సీఐ మాట్లాడుతూ అత్యవసర సహాయం, ప్రమాదకర పరిస్థితిలో ఈ యాప్ ద్వారా పోలీసులకు వెంటనే సమాచారం ఇవ్వవచ్చునన్నారు. ఒక క్లిక్ ఎస్ఓఎస్ అలర్ట్, ఒక్క కీ నొక్కితే పోలీసులకు, కుటుంబ సభ్యులకు, స్నేహితులకు సందేశం వెళుతుందన్నారు. జియో లోకేషన్ ట్రాకింగ్ అత్యవసర పరిస్థితుల్లో, పోలీస్ కంట్రోల్ రూమ్ మహిళ ఉన్న ప్రదేశాన్ని తక్షణమే గుర్తించి సహాయం అందించగలదన్నారు. వీడియో రికార్డింగ్ ఏదైనా సంఘటన జరుగుతున్నప్పుడు, శబ్దాన్ని, వీడియోను రికార్డు చేసి పోలీసులకు పంపే అవకాశం ఉందన్నారు. గూగుల్ ప్లే స్టోర్‌లో శక్తి యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలి. అధ్యాపకులు వై.జ్ఞానప్రసూనాంబ, టి.రేణు కాదేవీ, కుముద, రంగమణి, పోలీసులు పాల్గొన్నారు.

సమ్మర్ క్లబ్‌లకు కిట్లు పంపిణీ

పామర్రు: ప్రస్తుత వేసవిలో చిన్నారులు ఎండలలో తిరిగి ఆరోగ్యాలను పాడు చేసుకోకుండా గ్రామాలలో సమ్మర్ క్లబ్‌లను ఏర్పాటు చేశామని పీటీపీఎఫ్ డైరెక్టర్ సాల్మన్ కొల్లాబత్తుల పేర్కొన్నారు. స్థానిక చాట్లవానిపురంలోని విజన్ లైఫ్ సెంటర్‌లో పాస్టర్ల సమావేశం బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నారులు వేసవిని సద్వినియోగం చేసుకునే విధంగా సమ్మర్ క్లబ్‌లను ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసి వాటి ద్వారా చిన్నారులకు అక్కడే ఆటలు, పాటలు నిర్వహించేలా చర్యలు తీసుకుంటామన్నారు. పలు రకాల పుస్తకాలను వారికి ఇచ్చి వాటిలోని విషయాలను క్విజ్, డిబేట్ తదితరాల ద్వారా పోటీలను నిర్వహిస్తామన్నారు. విజేతలైన వారికి బహుమతులను అందిస్తామని తెలిపారు. అనంతరం క్లబ్ సభ్యులకు కిట్లను పంపిణీ చేశామని తెలిపారు. పాస్టర్లు కె.సామ్యూల్, టీ పీటర్ సాల్మన్, టీ షాలేం రాజు, కె.సునీల్, వీ ఆదాము, ఎంపీ ప్రసాద్, జె. భూషణం పాల్గొన్నారు.

ఇఫ్తార్ విందు

మండవల్లి: పవిత్ర రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని అల్లినగరంలోని మసీదులో బుధవారం రాత్రి నిర్వహించిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్సీ జయమంగళ వెంకటరమణ పాల్గొన్నారు. మత పెద్దల ఆధ్వర్యంలో ముస్లింలతో కలిసి సామూహిక మత ప్రార్థనలు నిర్వహించారు.